క్లుప్తంగా

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 44 ఏళ్ల లోపు, ఇంటర్ పాసైన వారు అర్హులన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490391324 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందిన అభాగ్యులు

అల్లిపురం: ఏయూటీడీ సిబ్బంది రైల్వే పోలీసుల సహకారంతో బుధవారం ఎనిమిది మంది నిరాశ్రయులను జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్ హోంలకు తరలించారు. దయగాన్, ఒడిశాకు చెందిన ప్రీతీ రాజేశ్వరి, బీహార్‌కు చెందిన పురుషులు సుఖన్, బొబ్బిలికి చెందిన తాబ్బరి సత్యనారాయణ, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన లాకొజీ నారాయణ స్వామి, గుర్లకు చెందిన పెనుబర్తి నాయుడు, కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన రాజు, దువ్వాడకు చెందిన నిర్మల్ సింగ్, బీహార్, బంకాకు చెందిన సంతోష్ కుమార్ శర్మ తదితరులను షెల్టర్‌కు తరలించారు. వీరిలో ఒక్కరు మినహా మిగతా వాళ్ల మానసిక స్థితి సరిగా లేక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పెట్టింది తింటూ బతుకుతున్నారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీరందరినీ ఫుట్‌పాత్‌లు ఖాళీ చేయించి షెల్టర్లకు తరలించినట్లు వాసు తెలిపారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు నిర్వహించారు. పరవాడ ఆస్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-2పై వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో అవగాహన సదస్సులో సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి, ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఒకప్పుడు పారిశ్రామిక ప్రాంత ప్రజల ఆరోగ్యప్రదాయినిగా నిలిచిన ఎఫ్ఆర్‌యూ, నేడు కళ తప్పింది. వైద్య నిపుణులు లేకపోవడం, మందుల కొరత, వసతుల లేమి వంటి సమస్యలు ఆస్పత్రిని వేధిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్పత్రిలో సమస్యలను **పట్టించుకోకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.**

వైద్యం.. దైన్యం



రోగులు లేక ఖాళీగా ఉన్న ఓపీ విభాగం

- ఎఫ్ఆర్‌యూలో మందుల కొరత
- ప్రధాన విభాగాలకూ లేని వైద్య నిపుణులు
- సిబ్బందికి వేతన వెతలు
- సేవలు అందక రోగుల అవస్థలు



అరకొరగా మందుల పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద రోగులకు వైద్య సేవలు అందించేందుకు 20 ఏళ్ల క్రితం 4 ఎకరాల విస్తీర్ణంలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించారు. ఇక్కడ వైద్య సేవలు పొందేందుకు పారిశ్రామిక ప్రాంత నలుమూలలనుంచి వందల సంఖ్యలో రోగులు బారులు తీరేవారు. కానీ ప్రస్తుతం ఆస్పత్రిలో కనీస సదుపాయాలు లేకపోవడంతో రోగుల సంఖ్య బాగా తగ్గిపోయింది.

అరకొర మందులే..

ఆస్పత్రిలో కేవలం యాంటిబయోటిక్, నొప్పుల మాత్రలు (పెయిన్ కిల్లర్), చర్మ సమస్యలు, కఫం, దగ్గు, ఆయాసానికి సంబంధించిన మాత్రలు అరకొరగా ఉన్నాయి. ఈ మాత్రలు వారానికి ఒక్కసారి తెచ్చుకోవడం, తెచ్చిన మాత్రలు అరకొరగా సర్దడం వంటివి ఇక్కడ ఫార్మసిస్ట్ చేస్తుంటారు. పై మాత్రలే తప్ప ఏ ఆరోగ్య సమస్యలు వచ్చినా, ఇక్కడ మందులు లేవు.

వైద్య నిపుణులేరి?

ఆస్పత్రిలో స్త్రీ వైద్య నిపుణులు, పిల్లల వైద్యులు, చర్మ వైద్య నిపుణులు లేరు. ప్రతిరోజూ ఉదయం ఇద్దరు జనరల్ వైద్యులు రావాలి, కానీ ఒక్కరే వస్తున్నారు. ఇక్కడ ప్రసవాలు మానేశారు. డెలివరీ రూమ్‌లో పరికరాలు కూడా సరిగ్గా పని చేయడం లేదని చెబుతున్నారు.

'కోరమాండల్'కు అప్పగిస్తారా?

గుల్లలపాలెం వద్ద గల 30 పడకల ఎఫ్ఆర్‌యూను కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ తీసుకునే యోచనలో ఉంది. ఆస్పత్రిలో ఆధునిక వసతులను కల్పించి, వైద్య నిపుణులను ఏర్పాటు చేసి రోగుల నుంచి నామమాత్రం ఫీజు తీసుకునే ఆలోచనలో యాజమాన్యం ఉంది. అందుకు గాను వారు పాలకులు, జీవీఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నారు. అయితే రోగుల నుంచి ఫీజు, ఎక్స్‌రే, ల్యాబ్ టెస్టులకు నామ మాత్రం ఫీజుల వసూళ్లపై కొంతమంది నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ఉచిత సేవలు అందించాలి గానీ, నామ మాత్రం ఫీజులు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ ప్రస్తుతం నిలిచింది.

సిబ్బందికి జీతాల్లేవు

ఇక్కడ పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, వాచ్‌మెన్, ఆయా, ల్యాబ్ టెక్నీషియన్, అంబులెన్స్ వ్యాన్ డ్రైవర్, ఫార్మసిస్ట్ తదితర సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు రావటం లేదు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఖాళీగా ఉన్న మందుల బాక్సులు



ఎఫ్ఆర్‌యూ ముఖద్వారం



రోగి పడుకున్న మంచంపై బెడ్‌షీట్, పిల్లో కవర్ లేని దృశ్యం

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ. 17.22 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీలు లెక్కించారు. 38 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.17,22,154 వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది, దేవదాయశాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

సత్కారం



శెట్టి వరలక్ష్మిని సత్కరిస్తున్న పరశురామ్

గోపాలపట్నం: బీజేపీ గోపాలపట్నం మండల అధ్యక్షురాలిగా శెట్టి వరలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు ఆమెకు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి పుట్టా గంగయ్య బాలరాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విమల విద్యాలయాన్ని పునఃప్రారంభించాలి



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులతో కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)ను వెంటనే పునః ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభించి వారం రోజులు అయినా పాఠశాలను తెరవలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం పెద్ద సంఖ్యలో పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాల తెరవక పోతే పరిస్థితి ఏంటంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ బి. గంగారావు అక్కడకు చేరుకుని నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తెరవక పోతే అందులో చదువుతున్న 1700 మంది విద్యార్థుల పరిస్థితి ఏంటన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు తక్షణం జోక్యం చేసుకుని పాఠశాల ప్రారంభించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలన్నారు.

ఆర్టీసీ మనుగడే ధ్యేయంగా పనిచేయాలి

మంత్రి రామ్‌ప్రసాదరెడ్డి



స్టీల్ సిటీ డిపోలో సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి రామ్‌ప్రసాదరెడ్డి

ఉక్కునగరం: ఆర్టీసీ మనుగడే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాదరెడ్డి అన్నారు. కూర్మన్నపాలెంలోని ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్టీసీ ఉంటేనే సిబ్బందికి ఉపాధి ఉంటుందన్నారు. ప్రయాణికులతో మమేకమై సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతకు ముందు డిపో ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో భాగంగా లంకెలపాలెం నుంచి రుషికొండ మీదుగా ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు నూతన సర్వీసు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జోన్ ఈడీ కె.ఎస్. బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, స్టీల్ సిటీ డిపో మేనేజర్ చటర్జీ, ఏడీఎం పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలు



పార్కులో మరో వైపు మద్యం గ్లాసు

జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలోని పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. నైట్ వాచ్‌మన్ లేకపోవడంతో చీకటిపడితే చాలు ఆకతాయిలు పార్కులోకి ప్రవేశించి ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు. దీంతో వాకింగ్‌కు వచ్చిన వారు అవస్థలు పడుతున్నారు. మద్యం సీసాలు, సిగిరెట్ పీకలు దర్శనం ఇవ్వడంతో కొంతమంది వాకింగ్ విరమించుకుంటున్నారు. పార్కు పరిసర ప్రాంతాలు వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కు మూసుకుని వాకింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకుంటుంది. సమస్యపై అధికారులు స్పందించి ఆకతాయిలకు చెక్ పెట్టాలని వాకర్స్ కోరుతున్నారు. - మల్కాపురం



వాకింగ్ ట్రాక్ పై మద్యం సీసా,గ్లాసు

ఫోకస్



వాకింగ్ పార్కులో అపరిశుభ్ర వాతావరణం

24న బంగారమ్మ పండగ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత బంగారమ్మతల్లి పండగ మహోత్సవం ఈ నెల 24న జరగనుంది. ఈ మేరకు బుధవారం గ్రామంలో అమ్మవారి జోగి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజారి వంశీయులు జోగిని శిరస్సుపై పెట్టుకుని పాత అడవివరంలోని బంగారమ్మ సతకంపట్టు నుంచి ప్రియాగార్డెన్స్‌లోని ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు.

సమాజసేవ, విద్యాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్చి బిషప్ ఉడుముల బాల

డాబాగార్డెన్స్: ఆలిండియా క్యాథలిక్ యూనియన్ విశాఖపట్నం సర్వసభ్య సమావేశం బుధవారం మహారాణిపేట ఆర్‌సీఎం పాస్టరల్ సెంటర్ హాల్లో నిర్వహించారు. విశాఖ ఆర్చి బిషప్ ఉడుముల బాల పాల్గొని పలు సూచనలు చేశారు. సంఘం విశాఖ గౌరవ అధ్యక్షుడు గోన స్వామినాథం మాట్లాడుతూ ఏఐసీయూ విధి విధానాలు, కార్యకలాపాలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణ తదితర విషయాలు వివరించారు. సంఘం విశాఖ రీజియన్ అధ్యక్షుడు, జాతీయ సహాయ కార్యదర్శి బూర వేలంగిణి రవీంద్ర శేషుబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, సమాజ సేవ, విద్యాభివృద్ధి, పేదలు, అభాగ్యులు, బడుగు వర్గాలను పైకి తీసుకురావడంలోనూ ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, వందేళ్ల పైబడిన సంఘం పురోగతిని వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏఐసీయూ సభ్యుడు చిట్టిబాబును ఆర్చి బిషప్ ఉడుముల బాల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ ఎం.ప్రతాప్, విశాఖ అర్బన్ డీన్ ఫాదర్ ఎస్.ప్రతాప్, ఏఐసీయూ కార్యదర్శి బేతా జోసెఫ్, కోశాధికారి పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరుల్లో.. సాగుకు అనాసక్తి!

ఎన్నో పుట్టుధారలకు నిలయమైన సింహగిరి కొండల్లో పండే అనాస (పైనాపిల్) రుచే వేరు. అందుకే ఇక్కడి అనాసకు ఎంతో డిమాండ్. ఏటా జూన్ నుంచి ఆగస్టు వరకు సింహగిరి అనాస పండ్లు కనువిందు చేసేవి. సింహాచలం పరిసర ప్రాంతాల్లో గుట్టలుగా పోసి విక్రయించేవారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పెద్ద ఎత్తున వాటిని కొనుగోలు చేసేవారు. అప్పట్లో విరివిగా లభించే వీటిని ఇతర ప్రాంతాలకూ ఎగుమతి చేసేవారు. అలాంటిది ఇప్పుడు ఇతర ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన అనాస పండ్లను సింహాచలంలో విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది.





- సింహాచలం అనాస రుచులు ఇక గతం
- ఒకప్పుడు గుట్టలుగా పోసి విక్రయాలు
- నేడు కనీస స్థాయిలోనూ కనపడని వైనం
- వీటి సాగువల్లే పైనాపిల్ కాలనీ పేరు!

సింహాచలం: ఎంతో ప్రసిద్ధి చెందిన సింహగిరి అనాస(పైనాపిల్) ర్నాను కనుమరుగవుతోంది. ఒకప్పుడు సింహగిరి కొండల్లో అనాస పండేదట.. ఎంతో తియ్యని రుచితో ఉండేదట.. అని రానున్న రోజుల్లో మన పిల్లలు చెప్పుకునే పరిస్థితి నెలకొంది. ఏడేళ్ల కోసారి పంట భూమిని మార్చాల్సి రావడం, కూలి ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సింహగిరి రైతులు ఆవేదనతో చెప్తున్నారు.

మూడేళ్లకు కాపు.. ఏడేళ్లకు భూ మార్పు

అనాస పంట వేసిన మూడేళ్లకు చేతికొస్తుంది. ఈ ఏడాది నారు నాటితే వచ్చే ఏడాది కాకుండా ఆ వచ్చే ఏడాది పంట చేతికొస్తుంది. తొలిసారి ఒక కాయ మాత్రమే కాస్తుంది. ఆ తర్వాత మొక్క నుంచి పక్కన పిలకలు వచ్చి రెండు కాయలు కాస్తుంది. అలా వచ్చే పిలకల ఆధారంగా కాయల సంఖ్య పెరుగుతుంది. ఏడేళ్ల మాత్రమే పంట వస్తుంది. ఆ తర్వాత ఆ భూమిలో సారం తగ్గి పంటకు అనుకూలించదు. దీంతో ఆ స్థలాన్ని అలానే వదిలేసి, మరో స్థలాన్ని వెతుక్కోవాలి.

వర్షాధారం.. ఎంతో కష్టం

రైతులు అనాస పండించేందుకు కొండల్లోకి ఉదయం వెళ్తే తిరిగి సాయంత్రానికే ఇంటికి వచ్చేవారు. పూర్తిగా వర్షాధారం. అనాస సాగుకు కొండపై తుప్పల్ని, పిచ్చి మొక్కల్ని తొలగించి, స్థలాన్ని సిద్ధం చేసేందుకు చాలా కష్టపడాలి. నారు వేయడం, గొప్పుతవ్వడం తదితర పనులు చేసేవారు. అడవిపందుల బారిన పడకుండా పంటను కాపాడుకునేందుకు నిరంతర కాపలా తప్పనిసరి. ఇంతచేసినా ఒక్కో ఏడాది దిగుమతి సరిగా రాకపోవడం, అడవి పందులు పంటలను నాశనం చేయడంతో కష్టం వృథాగా మారిన సంఘటనలెన్నో..!

పైనాపిల్ కాలనీ ఏర్పడిందిలా..

సింహగిరి కొండల్లో రైతులు దేవస్థానం వద్ద శిస్తు కట్టి తీసుకున్న స్థలంలో అనాసను పండించేవారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఈ కొండల్లో సుమారు 250 ఎకరాలను(కొండ, కొండవాలు కలిపి) సన్నకారు రైతులకు అందించారు. ఒక్కొక్కరికి ఎకరం పొలంతో పాటు, ఒక ఇల్లు చొప్పున కేటాయించారు. అదే ఇప్పుడు సింహాచలం నుంచి హనుమంతవాక దారిలో ఉన్న పైనాపిల్ కాలనీగా పేరుగాంచింది. పేద రైతులంతా ఇక్కడ ఉంటూనే సమీపంలో ఉన్న కొండల్లోకి వెళ్లి అనాసను పోడు వ్యవసాయంగా సాగుచేసేవారు.

అనాస పోయె.. జీడి వచ్చె!

అప్పట్లో అనాస పంట వేసిన కొండ అంతటా ప్రస్తుతం జీడి, పనస చెట్లే కనిపిస్తున్నాయి. ఏడేళ్ల తర్వాత అనాస పంటకు ఆ భూమి సహకరించకపోవడంతో రైతులంతా జీడి సాగుకు మళ్లారు. మరో చోట వేయాలంటే దేవస్థానం కొండ కావడం, అప్పటికే ఇందిరమ్మ పేరిట ఇచ్చిన భూములు కూడా దేవస్థానానికి చెందిన గ్రీన్‌బెల్ట్‌గా ప్రకటించడంతో చాలా మంది రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మరో వైపు అనాస సాగులో నష్టాలు, కూలి ఖర్చు భారమవడంతో రైతులు ఈ పంటల సాగును విరమించుకున్నారు.

ఏడేళ్లు సాగు చేశా..



నేను ఏడేళ్లపాటు అనాస సాగుచేశా. అప్పట్లో ఇందిరమ్మ ఇచ్చిన మొత్తం 250 ఎకరాల్లోనూ రైతులు అనాస సాగుచేసేవారు. ప్రస్తుతం జీడి చెట్లు కనిపిస్తున్న కొండంతా అప్పట్లో అనాస తోటలే ఉండేవి. ఎస్.కోటకు ఇక్కడి నుంచే పెద్ద ఎత్తున అనాసపళ్లు పంపించేవాళ్లం. ఏడేళ్ల తర్వాత భూసారం తగ్గి, అనాస పంటకు ఆ భూమి పనిచేయదు.

– బంధం లక్ష్మణరావు, రైతు, పాత అడవివరం

వాల్తేర్ డివిజన్‌లో యోగా డే ప్రత్యేక కార్యక్రమాలు



యోగా డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం -2025లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ నేతృత్వంలో బుధవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గల స్కూల్ విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక విద్యార్థులు, రైల్వే ఉద్యోగుల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్‌లోని రైల్వే ఉద్యోగుల కోసం ఇదే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా రైల్వే సిబ్బంది, ఉద్యోగులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే ఉద్యోగుల కుటుంబాలు కలిసి పలు రైల్వే స్టేషన్లలో యోగా సాధన చేశారు. పిల్లలు, పెద్దలు, ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా మనసు, శరీరాన్ని అదుపులో ఉంచుకోవచ్చని డీఆర్ఎం లలిత్ బోరా ఈ సందర్భంగా తన సందేశంలో తెలిపారు.